# మాతృత్వంలో మాధుర్యం



*గృహీత పశ్యతేయం*
*ప్రహసిత వదనాహి పత్యురర్పయతి*
*జాయాతనయ నవోద్గత*
*దంతయుగే నాంకితం బదరం*

**భావం:** భార్య "ఇదిగో చూడండి" అని కొడుకు కొత్తగా వచ్చిన రెండు పళ్ళతో కొరికిన గుర్తులున్న రేగుపండును నవ్వుముఖంతో భర్తకిస్తున్నది.

జలజకూ, వసుమంతుడికీ వివాహమైన చాలా కాలానికి కానీ సంతానం కలగలేదు. వసుమంతుడికి రెండవ వివాహం చెయ్యాలని కూడా అతని తల్లి ప్రయత్నించింది. కానీ జలజపై అపరిమితమైన అనురాగమున్న వసుమంతుడు అంగీకరించలేదు. వివాహమైన ఏడేళ్ళకి కొడుకు పుట్టాడు. జలజకు ఆనందం అవధులు దాటింది. ఆమెకు కొడుకుతోనే లోకమైపోయింది.

మూడో నెలలో ముద్ద కుడుములూ, నవ్వులకి నువ్వుండలూ, పాకితే పాకుండలూ, అడుగులకి అరిసెలూ అనుకుంటూ ఆమె కొడుకు ప్రతి చేష్టనూ మురిసి పోతూ పండుగలా చేసి ఊరందరినీ పిలిచి పేరంటం చేసింది. కొడుకే లోకంగా జీవించే ఆమెను " నేను అనే వ్యక్తిని ఉన్నాననైనా గుర్తుందా" అని వసుమంతుడు మేలమాడే వాడు. ఆమె "ఎందుకు గుర్తులేరు? ఈ అపూర్వమైన వరాన్ని మీరు ప్రసాదించారు కదా" అంటూ సిగ్గుపడేది. కొడుక్కి ఎప్పటికీ పళ్ళు రాలేదని ఆమెకు దిగులు కలిగింది. అత్తగారు పుల్ల విరుపుగా "ఆలస్యంగా పుట్టాడు. ఆలస్యంగా వస్తాయిలే" అనేదే కానీ ధైర్యం చెప్పేది కాదు. గ్రామ వైద్యుణ్ణి సంప్రదిస్తే " కొందరికి ఆలస్యంగా వస్తాయి. కొందరికి తొందరగా వస్తాయి. భయం లేదు" అన్నాడు. ఒకరోజు సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వచ్చిన వసుమంతుడికి జలజ గుమ్మంలో ఎదురై రేగు పండు చేతిలో పెట్టి " చూడండి" అంది. అతనికి రేగుపండు చూడగానే ముందు ఏమీ అర్థంకాలేదు. భార్య నవ్వు ముఖంతో ఉంది. " పుల్లపుల్లగా, తియ్యతియ్యగా అంటే మళ్ళీ ఏమైనా... జలజ సిగ్గూ, కోపం కలిపి ప్రదర్శించింది. లోపలకు తీసికెళ్ళి కొడుకుని చూపించింది. బాబు నోరు తెరిచాడు. చిన్న చిన్నగా తెల్లని పళ్ళు కన్పించాయి. రేగు పండుని చూశాడు. సన్నటి గుర్తులున్నాయి. బాబు పండుని కొరికాడన్నమాట. భార్య సంతోషం అర్థమైంది. పితృ హృదయం గర్వంతో ఉప్పొంగింది. తల్లి తండ్రులని చూసిన పసిబిడ్డ నోరు తెరిచి నవ్వాడు. నోట్లో విశ్వమంతా చూపిన బాలకృష్ణుడు గుర్తొచ్చి జలజా, వసుమంతులు తన్మయత్వంతో పులకించి పోయారు. మాతృత్వంలోని మాధుర్యం ముందు ఇంకే ఆనందమూ నిలబడలేదు. హీరోల కుప్పిగంతులతో, హీరోయిన్ల అర్ధనగ్న సౌందర్యంతో ఉండే సినిమాలనూ, అత్తాకోడళ్ళు ఒకరికొకరు విషమిచ్చుకునే టి.వి. సీరియళ్ళనీ మిస్ అయిపోతున్నామని వగచే ఆడవాళ్ళకీ, పిల్లలు పుట్టాక సుఖం లేదు అని విసుక్కునే మగవాళ్ళకీ ఒక్కసారి పసి పిల్లల బోసినవ్వూ, ఎత్తుకోమని అందించే చేతులూ, ముద్దు పలుకులూ చూస్తే నిజమైన ఆనందమేదో తెలుస్తుంది.

పై శ్లోకానికి శృంగారపరమైన వ్యాఖ్య కూడా ఉంది.

******